## మంచి వార్త




# గిరిజన మహిళల ‘హిమ్మత్’

**ఛత్తీస్‌గఢ్** రాష్ట్రం సర్గుజా రేంజ్‌లో గిరిజన జనాభా 55 శాతం వరకు ఉంటుంది. అయితే, మహిళలలో అక్షరాస్యత శాతం 42 మాత్రమే. దీన్ని మహిళా సాధికారతకు సవాలుగా పరిగణించారు భావనా గుప్తా అనే మహిళా ఐపీఎస్. గతంలో ఆమె పశ్చిమ బెంగాల్‌లో పనిచేశారు. తర్వాత ఛత్తీస్‌గఢ్ క్యాడర్‌కు వచ్చారు. సర్గుజా రేంజిలో అంబికాపూర్, సూరజ్‌పూర్ జిల్లాల్లో గిరిజన స్త్రీల జీవితాల్ని అతిదగ్గరి నుంచీ గమనించారు. వారిలో ఆత్మవిశ్వాసం పాదుకొల్పాల్సిన అవసరాన్ని గుర్తించారు. ఆ ప్రయత్నంలో సూరజ్‌పూర్‌లో ‘హిమ్మత్’ (ధైర్యం) అనే మహిళా భద్రత సంస్థను నెలకొల్పారు. ఇందులో చేరిన స్త్రీలకు 5 వారాలపాటు ఆత్మరక్షణ నైపుణ్యాల శిక్షణ ఇప్పించారు. న్యాయవ్యవస్థ, చట్టం గురించి అవగాహన తరగతులు నిర్వహించారు. ఆర్థిక సాధికారత కోసం యువతులకు కెరీర్ కౌన్సెలింగ్‌లో సాయం చేశారు. ఆమె చొరవ కారణంగా.. వెయ్యి మందికిపైగా యువతులు ఆర్థిక స్వాతంత్ర్యం సంపాదించుకున్నారు. గిరిజన స్త్రీల జీవితాల్లో ఆశావహమైన మార్పు కోసం చేస్తున్న కృషికి గుర్తింపుగా భావనకు ఈ ఏడాది అంతర్జాతీయ పోలీస్ పురస్కారం కూడా లభించింది. ఆ తర్వాత అంబికాపూర్‌లోనూ ‘హిమ్మత్’ కార్యక్రమాలను కొనసాగించారు. దాదాపు 1,500 మంది గిరిజన బాలికలకు వివిధ అంశాల్లో శిక్షణ ఇప్పించారు. వీరిలో కొందరు బాలికలు రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో పతకాలు సాధించారు. ఇంకొంతమంది మెరిట్ స్కాలర్‌షిప్‌లు తెచ్చుకున్నారు. ఈ క్రమంలో తమ బిడ్డల సామర్థ్యం మీద తల్లిదండ్రులకు నమ్మకం పెరిగింది. భావన తన బృందంతో కలిసి సర్గుజా ప్రాంత గిరిజన స్త్రీలకు మహిళా హక్కుల గురించి కూడా అవగాహన కల్పిస్తున్నారు. ‘గిరిజన స్త్రీలు నిశ్శబ్దంగా ఉండటం మంచిది కాదు. దీనివల్ల పీడన ఆగదు’ అన్నది భావన అభిప్రాయం. మొత్తానికి ఈ కార్యక్రమాల వల్ల సర్గుజాలో మధ్యలోనే బడి మానేసే ఆడపిల్లల సంఖ్య తగ్గిపోయింది. మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు, వెట్టిచాకిరికి అడ్డుకట్ట పడింది. వృద్ధుల భద్రత కోసం భావన తాజాగా ‘సమర్పణ్’ అనే కార్యక్రమాన్నీ ప్రారంభించారు.

## వైతాళికుల వాణి

ఒకరి జీవితాన్ని మరొకరు తీర్చిదిద్దలేరు. మీ విజయం, మీ సంతోషం మీ మీదనే ఆధారపడి ఉంటాయి. మీరే ఆలోచించుకుని మీ జీవితాన్ని ప్రణాళిక బద్ధంగా నిర్మించుకోవాలి.

• **సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య**

## క్యా బాత్‌హై!

